సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం | 14 | ఫిబ్రవరి | 2024

'మండమెలిగె'కు వేళాయె..

- నేడు మేడారం, కన్నెపల్లిలోని అమ్మవార్ల ఆలయాల్లో శుద్ధి
- పసుపు, కుంకుమలతో అలంకరణ
- ప్రత్యేక పూజలు నిర్వహించనున్న పూజారులు

- వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

అధికారులను బదిలీ చేయాలి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలో ఏళ్ల తరబడి విధులు నిర్వర్తిస్తున్న సింగరేణి అధికారులను బదిలీచేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి పసునూటి రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏరియాలోని వివిధ గనుల్లో అధికారులు ఏళ్ల తరబడి చేస్తూ కార్మికులను బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తూ వారికి అనుకూలంగా ఉన్న వారికి పనిభారం మోపడం లేదన్నారు. 3నుంచి ఆరేళ్ల తరబడి ఒకే గనిలో పనిచేయడం వలన పలువురు కార్మికులు విధులకు వెళ్లాలంటేనే భయపడుతున్నారని పేర్కొన్నారు.

కార్మికుల పరిరక్షణకే సమ్మె



భూపాలపల్లి అర్బన్: అన్ని వర్గాల కార్మికుల హక్కుల పరిరక్షణకే ఈ నెల 16న దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంపేటి రాజయ్య తెలిపారు. ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్–3లో మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరిస్తూ కాంట్రాక్ట్ కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను చట్టాలుగా మార్చి కార్మికుల గొంతు నొక్కుతుందన్నారు. కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా గ్రామీణ భారత్ బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏసుబాబు, క్రాంతి, కిరణ్, రాములు, ఐలయ్య పాల్గొన్నారు.

చిట్యాల మార్కెట్ పాలకవర్గం రద్దు

చిట్యాల: చిట్యాల మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని రద్దుచేస్తూ ప్రభుత్వ అగ్రికల్చర్ అండ్ కో–ఆపరేటివ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ రఘునందన్‌రావు జీఓ జారీచేసినట్లు మార్కెట్ కార్యదర్శి కనకశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిట్యాల మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా వరంగల్ జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాదరావుకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

బీజేపీ పాలనే దేశానికి రక్షణ



భూపాలపల్లి రూరల్: దేశానికి ప్రధాని మోదీ పాలనే రక్షణ అని బీజేపీ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తిరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో ధర్మారావు మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం మూడు పార్లమెంట్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు కిందిస్థాయి నుంచి పనిచేసి పార్టీని గెలిపించే విధంగా కృషిచేయాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు.

అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన నిశిధర్‌రెడ్డి

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఏడునూతుల నిశిధర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి, సత్యపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు నిశిధర్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజమౌళిగౌడ్, వెన్నంపల్లి పాపయ్య, కన్నం యుగేందర్, ఎరుకల గణపతి, బట్టు రవి, దొంగల రాజేందర్, మధుసూధన్‌రెడ్డి, గొర్రె శశికుమార్ పాల్గొన్నారు.

మహాజాతర వరకు పీఓగా అంకిత్ కొనసాగింపు

ఏటూరునాగారం: మేడారం మహాజాతరకు వరకు ఐటీడీఏ పీఓగా అంకిత్‌ను కొనసాగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఏటూరునాగారం ఐటీడీఏ పీఓగా కొనసాగుతున్న అంకిత్‌ను నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు)గా, నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్‌గా కొనసాగుతున్న చిత్ర మిశ్రాను ఏటూరునాగారం ఐటీడీఏ పీఓగా నియమిస్తూ సోమవారం రాత్రి సీఎస్ శాంతికుమారి ఉత్వర్వులను జారీ చేశారు. ఈ మేరకు చిత్రమిశ్రా మంగళవారం ఏటూరునాగారం ఐటీడీఏకు చేరుకొని అంకిత్ నుంచి చార్జ్ తీసుకొని విధుల్లో చేరారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి మంగళవారం సాయంత్రం ఐటీడీఏ పీఓగా అంకిత్‌ను మేడారం జాతర వరకు కొనసాగించాలని మౌఖికంగా ఆదేశాలు రావడంతో చిత్రమిశ్రా తిరిగి వెళ్లిపోయారు. జాతరకు మరో వారం రోజులే ఉండడంతో అన్ని విభాగాల్లో నిమగ్నమై ఉన్న అంకిత్‌ను ఐటీడీఏ పీఓగా కొనసాగించాలనే సమాలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

పరిశీలించి.. ఎత్తిచూపి

మేడిగడ్డలో సీఎం రేవంత్‌రెడ్డి, అఖిలపక్ష బృందం బిజీబిజీ

- బ్యారేజీ వద్ద నాలుగు గంటలు
- డౌన్ సీమ్‌లో పగుళ్లు, కుంగిన పియర్‌ల పరిశీలన
- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని దుయ్యబడుతూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- ప్రాజెక్టు లోపాలు, జరిగిన అవినీతిపై కేసీఆర్ టార్గెట్‌గా రేవంత్ ఆరోపణలు
- సుమారు 40 బస్సుల్లో పలువురు ముఖ్యుల రాక
- ఎల్‌అండ్‌టీ వద్ద భారీ బందోబస్తు

సాక్షి, ప్రతినిధి వరంగల్/కాళేశ్వరం: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ లోపాలను, వాస్తవిక పరిస్థితులను ప్రజలకు తెలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు, కాంగ్రెస్, ఎంఐఎం, సీపీఐ ఎమ్మెల్యేలతో కూడిన అఖిలపక్ష బృందం బ్యారేజీ వద్ద నాలుగు గంటల పాటు బిజీబిజీగా గడిపింది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల బృందం ప్రాజెక్టును ఆసాంతం పరిశీలించి.. అనంతరం పీపీటీ ద్వారా సమీక్షించారు. ప్రాజెక్టులోపాలను సుదీర్ఘంగా వివరించారు. మంగళవారం సీఎం బృందం రోడ్డు మార్గంలో హైదరాబాద్ నుంచి వరంగల్ మీదుగా మేడిగడ్డ వరకు ప్రత్యేక ఏసీ బస్సుల్లో పర్యటన సాగించింది. సుమారు 40 బస్సుల్లో పలువురు ముఖ్యులు తరలివచ్చారు. ముందుగా.. సీఎం కాన్వాయ్ సాయంత్రం 3.37 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుంది. ఆతర్వాత మంత్రులు, ఇతరులు వచ్చారు. అందరూ కలిసి నేరుగా రోడ్డు మార్గంలో బ్యారేజీ వంతెన మీదుగా కుడివైపున గల డౌన్ సీమ్‌లోకి చేరుకున్నారు. గతేడాది అక్టోబర్ 21న కుంగిన 7వ బ్లాక్‌లోని 19, 20, 21, 22 పియర్‌లను సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి చూశారు. అక్కడ వారికి ఇరిగేషన్‌శాఖ జగిత్యాల ఇన్‌చార్జ్ సీఈ సుధాకర్‌రెడ్డి వాస్తవ పరిస్థితులు వివరించారు. గేట్ల వద్ద పగుళ్లు, పియర్‌ల అడుగు భాగంలో 4–5 ఫీట్ల మేర కుంగిన భాగాన్ని పరిశీలించారు. 4.35 గంటలకు సభాస్థలి వద్దకు చేరుకున్నారు. అక్కడ పోలీసులు సీఎంకు గౌరవ వందనం చేశారు. 5.04 గంటలకు సీఎం కాన్వాయ్ నుంచి నేరుగా స్టేజీ పైకి వచ్చారు. ముందుగా మంత్రి శ్రీధర్‌బాబు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాల్సిందిగా ఇన్‌చార్జ్ సీఈ సుధాకర్‌రెడ్డికి చెప్పారు. మూడు ప్రాజెక్టుల ద్వారా పాయింట్ టు పాయింట్ ఖర్చులు, నిర్వహణ వ్యయాలు, విద్యుత్ వినియోగం, నీరు అందించిన, అందించాల్సిన ఆయకట్టు, ఎంత ఖర్చు చేశారు? ల్యాండ్ అక్విటెన్స్, నీటి వనరుల గురించి, కుంగిన విధానంపై సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలకు, జర్నలిస్టులకు వివరించారు. తర్వాత 5.38 గంటలకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ రాజీవ్‌రతన్ కుంగిన బ్యారేజీపై ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలు వివరించారు. పాత కాఫర్‌డ్యాం, కొత్తగా నిర్మించిన కాఫర్ డ్యాం గురించి తెలిపారు. నిర్వహణ, మరమ్మతులు లేక కుంగుబాటుకు కారణంగా వివరించారు. అన్నారంలో సీపేజీ గుర్తించినట్లు వివరించారు. 18–02–2020లోనే మొదట సీపేజీ లీకేజీ గుర్తించిన అప్పటి ఇంజనీర్లు ప్రభుత్వానికి లేఖ రాసినా పట్టించుకోలేదని ఆయన తెలిపారు. మధ్య మధ్యలో సీఎం పీపీటీ ప్రజెంటేషన్‌లో మాజీ సీఎం కేసీఆర్‌పై ఆరోపణలు, విమర్శలు చేశారు.



మేడిగడ్డ ప్రాజెక్టులో కుంగిన భాగాన్ని పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యేలు, ఇతరులు

నాడు చూసేందుకు కూడా రానివ్వలేదు..

సీఎం రేంవత్‌రెడ్డి మాట్లాడుతూ అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బ్యారేజీ చూడడానికి పోలీసులు తమను రానివ్వలేదని, అప్పటి ఎన్నికల అధికారులతో మాట్లాడి తమ నేత రాహుల్‌గాంధీతో ప్రతిపక్ష హోదాలో వచ్చామన్నారు. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుపై తీవ్రంగా మండి పడ్డారు. బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య చీకటి దోస్తానా ఉందన్నారు. సుమారు అరగంటపాటు సీఎం మాట్లాడారు. త్వరలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సీఎం 12 నిమిషాల పాటు సమాధానాలు చెప్పారు. 7.06 గంటలకు సభాస్థలి నుంచి తిరిగి కాన్వాయ్‌లోకి వెళ్లారు.



ప్రాజెక్టుపై పీపీటీలో వివరిస్తున్న అధికారులు

కొంత గందరగోళం

గేట్ల వద్ద పగుళ్లు, పియర్‌ల అడుగు భాగం పరిశీలించిన తర్వాత కొంతసేపటికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర శాఖల నాయకులు ఒక్కసారిగా వేదిక వద్దకు వచ్చారు. అప్పటికి సీఎం కాన్వాయ్‌లోనే ఉన్నారు. ఒక్కసారిగా అందరూ రావడంతో సుమారు అరగంట పాటు ఎక్కడ ఎవరు కూర్చోవాలో తెలియక తికమక పడ్డారు. తర్వాత మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకుని ఎమ్మెల్యేలు కింద, మంత్రులు, ముఖ్యులు వేదికపై ఉండాలని సూచించడంతో కొంత మంది దిగువన కుర్చీల్లోకి వెళ్లారు.

కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు, వినోద్, రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్(ఐతు), కలెక్టర్ భవేశ్‌మిశ్రా, ఎస్పీ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు..

మావోల ఇలాఖాలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మహదేవపూర్ నుంచి ఎల్‌అండ్‌టీ రోడ్డు మార్గం, బొమ్మాపూర్, సూరారం రోడ్డు మార్గంలో అడుగడుగునా పోలీసులు పహారా కాశారు. ఉదయం నుంచి రాత్రి వరకు నలుగురు ఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 20 మంది వరకు సీఐలు, 40 మంది వరకు ఎస్సైలు, 800మంది పోలీసులు విధులు నిర్వర్తించారు.

పర్యటన మొత్తం రోడ్డు మార్గం ద్వారానే..

సీఎం బృందం ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం గుండా మేడిగడ్డ బ్యారేజీకి వచ్చారు. తిరిగి రాత్రి రోడ్డు మార్గం ద్వారానే బయల్దేరి వెళ్లారు. కాగా.. హెలికాప్టర్ ద్వారా తిరుగు ప్రయాణం అవుతారని అధికారులు హెలిపాడ్‌లు సిద్ధం చేశారు. కానీ.. సీఎం తమ బృందంతో రాత్రి బస్సు కాన్వాయ్‌లో బయల్దేరి వెళ్లారు.

ఎమ్మెల్యేలందరినీ ఆహ్వానించాం



మేడిగడ్డ బ్యారేజీ పర్యటనకు శాసనసభలో ఎమ్మెల్యేలందరినీ ఆహ్వానించాం. అయినా బీఆర్‌ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు రాలేదు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల విచారణ తర్వాత సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి సందర్శించారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేసేందుకే సందర్శనకు వచ్చారు. ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నా.

- దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి

అప్పు తెచ్చి ప్రాజెక్టు కట్టారు



రూ.94వేల కోట్ల ఖర్చుతో 90వేల ఎకరాల్లో నీళ్లు పారించారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రాజెక్టును కట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బ్యారేజీ కట్టి నీటిని నిల్వ చేసి ఎన్నికల ముందు పబ్లిసిటీ చేశారు. ఇలాంటి భారీ కుంభకోణం భారతదేశంలోనే చూడలేదు. దీనిలో జరిగిన అవినీతిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి

'కాళేశ్వరం ప్రాజెక్టును ఇలా చూడడం బాధాకరం'

కాళేశ్వరం ప్రాజెక్టును ఇలా చూడడం బాధాకరంగా ఉంది. మేడిగడ్డ పగుళ్లు కాదు..తెలంగాణ ప్రజల గుండె పగుళ్లు. 3 ఏళ్లలో నిర్మించడం..8ఏళ్లలో కూలిపోవడం. ప్రాజెక్టు డిజైన్ చేయడమే తప్పుగా చేశారు. మోతాదుకు మించి నీటిని నిల్వ చేసి ప్రాజెక్టును నాశనం చేశారు. నిర్మాణంలోనే అతిపెద్ద లోపం ఉంది. నాణ్యత లోపంతో నిర్మాణం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

- కూనంనేని సాంబశివరావు, సీపీఐ ఎమ్మెల్యే



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొన్నం, తుమ్మల, సీతక్క, జూపల్లి, ఎమ్మెల్యేలు

విధులను సేవగా భావించాలి

- భక్తులకు సౌకర్యాలు కల్పించాలి
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- జాతర ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరలో పని చేసే అధికారులు అమ్మవార్లకు సేవగా భావించాలని, జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మేడారంలోని హరితహోటల్‌లో మంత్రి సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎ.శరత్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్‌తో కలిసి అధికారులతో జాతర ఏర్పాట్లపై మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం జాతరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, ముఖ్యంగా జంపన్నవాగు పరిసర ప్రాంతాలలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాద స్థలాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎండ తీవ్రత పెరిగిందని భక్తులు తాగునీటికి ఇబ్బంది పడొద్దని అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలు ప్రపంచానికి తెలిసే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ స్థలాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సైన్ బోర్డులు, ఫ్లడ్ లైట్లు, తాగునీరు, టాయిలెట్ తదితర అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జాతరలో అధికారుల పని తీరును గుర్తిస్తామన్నారు. జాతరకు నెల రోజుల ముందు నుంచే పోలీసులు భక్తులు ఇబ్బందులు పడకుండా వాహనాల నియంత్రణ, తదితర సేవలను నిరంతరంగా అందిస్తూ పని చేయడం అభినందనీయమన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సీఎంకు ఘన స్వాగతం



కాటారం మీదుగా వెళ్తున్న సీఎం కాన్వాయ్

భూపాలపల్లి అర్బన్/కాటారం: కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ సందర్శనకు భూపాలపల్లి మీదుగా వెళ్లిన సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందానికి జిల్లా నాయకులు స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఘన స్వాగతం పలికి పూలజల్లు కురిపించారు. సీఎం రేవంత్‌రెడ్డి బస్సులో నుంచి అభివాదం చేశారు. కాటారం మండలకేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద కూడా కాంగ్రెస్ శ్రేణులు భారీ స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కాంగ్రెస్ శ్రేణులకు అభివాదం తెలుపుతూ మేడిగడ్డకు వెళ్లారు. మంత్రి సీతక్క మేడారంలో సమీక్షకు హాజరై కాటారం మండలకేంద్రానికి సమీపంలోని చింతకాని క్రాస్ వద్ద ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న బస్సులో ఎక్కారు. డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ నాగార్జునరావు, ఎస్సైలు అభినవ్, సురేశ్, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఏఆర్ సీఐ, ఎస్సైలు, బందోబస్తు నిర్వహించారు.





సాక్షి చర్చావేదికలో పాల్గొన్న ఫార్మసీ విద్యార్థులు, చర్చా వేదికలో మాట్లాడుతున్న వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్‌యాదవ్

పెద్దలు కుదిర్చిన పెళ్లికే సై..

- సమస్యలకు వారే పరిష్కారం చూపుతారు
- పరస్పర అవగాహనతో ఇబ్బందులు ఉండవు
- జీవితం సాఫీగా, బంధం ఎక్కువ కాలం ఉంటుంది

'సాక్షి' చర్చావేదికలో యువతీయువకుల మనోగతం

ఖిలా వరంగల్ : ప్రేమ ఎంతో మధురమైంది.. పెద్దల అంగీకారంతో చేసుకునే పెళ్లి ఆనందంగా ఉంటుంది.. ఒక వేళ ప్రేమ పెళ్లి అయినా పెద్దలు ఒప్పుకుంటే జీవితం సంతోషంగా ఉంటుందని యువత చెబుతోంది. బుధవారం వాలెంటైన్స్ డే సందర్భంగా ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో మంగళవారం డిబేట్ జరిగింది. పెద్దలు కుదిర్చిన పెళ్లి.. ప్రేమ తర్వాతే పెళ్లి అనే అంశంపై ఫార్మసీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రావుల శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా వేదికలో ఫార్మసీ ప్రొఫెసర్లు, విద్యార్థులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఇందులో ఎక్కువ మంది విద్యార్థులు.. పెళ్లి తర్వాత ప్రేమే బాగుంటుందని పేర్కొన్నారు. ప్రేమతోనే జీవితం సాఫీగా సాగుతుందని, ప్రేమ లేకుంటే బంధాలు ఎక్కువ కాలం నిలవవని చెప్పారు. ముఖ్య అతిథిగా వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కమల్‌యాదవ్ హాజరై మాట్లాడారు. సంస్కృతీసంప్రదాయాలను అనుసరిస్తూ నేటి యువత ముందుకు సాగాలన్నారు. సమానత్వం భావనతో పరస్పరం గౌరవించుకోవాలని సూచించారు. సినిమాల్లో చూపినట్లు ప్రేమ ఉండదని, నిత్య జీవితంలో తప్పుదోవపట్టకూడదన్నారు. ప్రేమ పేరుతో దారుణాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి చేసుకుని ఆనందంగా గడపాలని ఆయన సూచించారు.

పెళ్లి తర్వాత ప్రేమ స్వచ్ఛమైనది



నా దృష్టిలో పెళ్లి తర్వాత ప్రేమ స్వచ్ఛమైనది. మన పెద్దలు వెనుకా ముందు ఆలోచించి పెళ్లి చేస్తారు. వారి అనుభవంతో కూడిన నిర్ణయాలు భవిష్యత్‌కు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఒకవేళ సమస్యలు వస్తే తల్లిదండ్రులే పరిష్కారం చూపుతారు. పెళ్లికి ముందు మనం తీసుకున్న నిర్ణయాల్లో పొరపాట్లు ఉండే అవకాశం ఉంది. వైవాహిక జీవితంలో ఒక్కటైన తర్వాత ఒకరినొకరు అర్థం చేసుకుని ముందుకు సాగితే ప్రేమ స్వచ్ఛంగా ఉంటుంది. జీవితం ఆనందంగా గడుపుతారు.

- పల్లం రాధిక బీఫార్మసీ ఫస్ట్ ఇయర్

బంధాన్ని నిలబెట్టుకోవాలి



పెళ్లికి ముందు ప్రేమించడం తప్పు కాదు. అయితే, నిజాయితీగా ఆ బంధాన్ని నిలబెట్టుకున్నప్పుడే ఆ ప్రేమకు విలువ ఉంటుంది. ప్రేమించిన వ్యక్తిని అన్ని సమయాల్లో నమ్ముతూ, గౌరవించాలి. జీవితంలో స్థిరపడిన తర్వాత ఆ విషయాన్ని తల్లిదండ్రులకు విన్నవించుకుంటే వారు సైతం ప్రేమకు అడ్డుచెప్పరు. తల్లిదండ్రులు, ఇరుకుటుంబాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. అప్పుడే ప్రేమకు నిజమైన సార్థకత ఉంటుంది.

- బి.అచ్యుత్, ఫార్మ్‌డీ ఫస్ట్ ఇయర్

ఆకర్షణకు లోనుకావొద్దు



పెళ్లికి ముందు ప్రేమ, పెళ్లి తర్వాత ప్రేమ రెండూ ప్రధానమే. ఎక్కడ ప్రేమ లేకున్నా బంధాలు నిలువవు. ఇప్పుడు ఇంటర్ మొదటి సంవత్సరంలోనే ప్రేమలో పడుతున్న వారిని చూస్తున్నాం. ఇది ఆకర్షణ మాత్రమే. పెళ్లి చేసుకుంటే విచ్ఛిన్నం తప్పదు. జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి చేసుకుంటే భవిష్యత్ బాగుంటుంది. అది ప్రేమ వివాహమైనా, పెద్దలు కుదిర్చిన వివాహమైనా ఎక్కువ కాలం నిలుస్తుంది.

- ఎస్.పావని, ఫార్మ్‌డీ ఫస్ట్ ఇయర్

అరెంజ్ మ్యారేజ్‌తో హ్యాపీ..



ఎవరి సంప్రదాయాలు వారికి ప్రధానం. మతాంతర వివాహాలు చేసుకుంటే వాళ్ల సంప్రదాయాలకు అనుగుణంగా ఉండకపోవడం ద్వారా ఇరువురి మధ్య విభేదాలు వస్తాయి. ఒకరినొకరు అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. ఎటువైపు దారి తీస్తాయో తెలియదు. పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకుంటే సంతోషంగా ఉంటారు.

- ఏపూరి హేమావర్షిణి, ఫార్మ్‌డీ ఫస్ట్ ఇయర్

ఏడు తరాలు చూడాలి



పెద్దలు సంబంధాలు చూసేటప్పుడు అటు ఏడుతరాలు, ఇటు ఏడు తరాలు చూసి పెళ్లి చేయాలంటారు. దాని వల్ల ఎలాంటి వారో తెలుస్తుంది. భవిష్యత్‌లో ఏమైనా సమస్యలు వస్తే దంపతుల మధ్య సయోధ్య కుదర్చుతారు. దాంపత్య జీవితం ఆనందంగా సాగుతుంది.

- కె.చందన, ఫార్మ్‌డీ ఫస్ట్ ఇయర్

ప్రేమ, ఆకర్షణకు తేడా తెలుసుకోవాలి



ప్రేమ పేరుతో చిన్నతనంలోనే జీవితాన్ని నాశనం చేసుకోవద్దు, ప్రేమ, ఆకర్షణకు తేడా తెలుసుకోవాలి. లవ్ మ్యారేజ్ మంచిదే అయితే.. ప్రస్తుతం సమాజంలో ఎంతోమంది విడాకులు తీసుకుంటున్నారు. అదే పెద్దలు కుదిర్చిన వివాహంలో సమస్యలు వస్తే ఇరువైపులా తల్లిదండ్రులు సపోర్టుగా ఉంటూ సర్దిచెబుతారు.

- సీహెచ్.హిందు, బీఫార్మసీ సెకండ్ ఇయర్

స్థిరపడ్డాకే పెళ్లి చేసుకోవాలి



పెద్దల అంగీకారం లేకుండా ప్రేమ పెళ్లి చేసుకుంటే తర్వాత ఇబ్బందులు ఎదురవుతాయి. తల్లిదండ్రులు మన జీవితం గురించే ఆలోచిస్తారు. వారు చూసిన సంబంధాలనే పెళ్లి చేసుకుంటే జీవితం మంచిగా ఉంటుంది. ముందు కష్టపడి చదువుకుని మంచి ఉద్యోగం సాధించాలి. ఆ తర్వాత తల్లిదండ్రులు చూపించిన వారినే చేసుకుని సంతోషంగా ఉండాలి.

- రిజ్వానా, ఫార్మ్‌డీ ఫస్ట్ ఇయర్

పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవాలి



ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకుంటే ముందుగా తల్లిదండ్రులను ఒప్పించాలి. జీవితంలో ఆర్థికంగా స్థిరపడ్డాకే పెళ్లి చేసుకోవడమే మంచిది. పెద్దలు కుదిర్చిన పెళ్లి అయితే ఇరు కుటుంబాల వారు కష్టనష్టాలు చూసుకుంటారు. పెళ్లి తర్వాత ఏదైనా సమస్య వచ్చినా చర్చించి పరిష్కరిస్తారు. యువత ఆకర్షణకు లోనుకుండా పెద్దలు కుదిర్చిన పెళ్లికి ప్రాధాన్యం ఇవ్వాలి.

- పలకల నివేదితారెడ్డి, ఫార్మసీ ఫస్ట్ ఇయర్

ఒకరినొకరు అర్థం చేసుకోవాలి



ముఖ్యంగా పాశ్చాత్య సంస్కృతిని విడనాడాలి. పెళ్లి ముందు ప్రేమ ముఖ్యం. ప్రేమించుకోవడం వల్ల ఒకరినొకరు అర్థం చేసుకుంటారు. అరెంజ్ మ్యారేజ్ అయినా ప్రేమ లేకపోతే కలిసి ఉండలేరు. పెళ్లికి ముందు తర్వాత ప్రేమ అవసరం. ఒకరినొకరు అర్థం చేసుకుని జీవితాలను సాగించాలి. ప్రేమించి పెళ్లి చేసుకున్నా జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలి.

- రావుల లతిక, ఫార్మసీ ఫస్ట్ ఇయర్

ప్రేమ విలువ తెలుసుకోవాలి



ప్రేమ విలువ తెలుసుకుని తల్లిదండ్రులను ఒప్పించాలి. ప్రేమ ఒక ఎంజాయ్‌మెంట్ వస్తువు కాదు. ప్రేమ వివాహమైనా, పెద్దలు కుదిర్చిన వివాహమైనా, మనం ప్రేమ చూపే విధానాన్ని బట్టి బంధాలు నిలుస్తాయి. ఒకరిపై మరొకరు డామినేషన్ చేయాలని చూస్తే ఆ బంధం నిలువదు. రెండు రకాల పెళ్లిళ్లలో పలు తప్పిదాలు ఉన్నాయి. ప్రేమ విలువను తెలుసుకుని సరిదిద్దుకోవాలి.

- ఎస్.లక్షిత, ఫార్మ్‌డీ ఫస్ట్ ఇయర్

ప్రేమా వందనం..

- నమ్మకమే పునాది
- కష్టాలు ఎదురైనా కడవరకు నిలిచే బంధం
- నేడు ప్రేమికుల దినోత్సవం

- వివరాలు 8లో ▸

ప్రేమా వందనం..



ప్రేమ.. ఓ మధుర అనుభూతి. మనసులు, మనోభావాలు కలిసిన జంట ఎన్ని కష్టాలనైనా ఎదిరించి తమ ప్రేమను గెలిపించుకోవడం కోసం దృఢసంకల్పంతో నిలబడుతుంది. పరువు, ప్రతిష్టపేరుతో పిల్లల ప్రేమను కాదన్న పెద్దలను సైతం ఒప్పించగల నమ్మకాన్నిస్తుంది.. ప్రాంతం వేరైనా.. కులం, మతం అడ్డుపడినా తెగించి కొట్లాడి నిలబడిన ప్రేమజంటలు ఎన్నో.. ఆనందమయ జీవనం సాగిస్తున్నాయి.. అలాంటి వారి మనసులోని మాటలతో ప్రత్యేక కథనాలు.. నేడు 'ప్రేమికుల దినోత్సవం' సందర్భంగా మీకోసం..

నమ్మకమే పునాది

- కష్టాలు ఎదురైనా కడవరకు నిలిచే బంధం
- నేడు ప్రేమికుల దినోత్సవం

మనసులు కలిశాయి



కృష్ణ, హేమలత దంపతులు

పెద్దవంగర: మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని రామచంద్రు తండాకు చెందిన జాటోతు కృష్ణ, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన కుడిక్యాల హేమలత హనుమకొండలో ఒకే కళాశాలలో డిగ్రీ చదివే సమయంలో ప్రేమించుకున్నారు. అయితే వీరి మనసులు కలిసినప్పటికీ కులాలు వేరు కావడంతో ఇరు కుటుంబాల పెద్దలు అభ్యంతరం తెలిపారు. 2005లో పెద్దలను ఒప్పించి కులాంతర వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం హేమాలత ఎన్‌ఐటీ వరంగల్‌లో గెస్ట్ లెక్చలర్‌గా విధులు నిర్వహిస్తుంది. కృష్ణ హెచ్‌డీఎఫ్‌సీ తొర్రూరు బ్యాంకులో ఏవీపీగా ఉద్యోగం చేస్తున్నాడు. తొందర పడి వివాహ నిర్ణయాలు తీసుకోవద్దని ఇరుకుటుంబాల అంగీకారంతోనే భద్రత ఉంటుందని చెబుతున్నారు హేమలత– కృష్ణ దంపతులు.

ఆర్యసమాజ్‌లో వివాహం



కేక్ కట్ చేస్తున్న ఉమేష్, గాయత్రి

దంతాలపల్లి: మండలం కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన వెలుమ ఉమేష్ యాదవ్, బత్తిని గాయత్రి పక్కపక్కన ఇళ్లలో ఉండేవారు. డిగ్రీ నుంచి ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో ఇరుకుటుంబాల పెద్దలు వీరి పెళ్లికి అంగీకరించలేదు. దీంతో హైదరాబాద్‌కు వెళ్లి ఆర్యసమాజ్‌లో రెండు సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకున్నారు. ఈ మధ్య పెద్దలు అంగీకారం తెలపడంతో రెండు కుటుంబాలు కలిసి ఆనందంగా గడుపుతున్నాయి.

ప్రేమకు కులమతాలు అడ్డుకావు..



మహబూబాబాద్ రూరల్ : షరీఫ్, పూజ అలియాస్ ఫర్హానా దంపతులు.. ప్రేమకు కులమతాలు అడ్డుకావని నిరూపించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని లెనిన్ నగర్ కాలనీకి చెందిన చెందిన సయ్యద్ హైమద్, బిపాషా దంపతుల ద్వితీయ కుమారుడు షరీఫ్, కంకర బోర్డు ప్రాంతానికి చెందిన నాగుల వెంకటలక్ష్మణ్, మంగమ్మ దంపతుల కూతురు పూజ ప్రేమించుకున్నారు. ఇద్దరూ తమ తల్లిదండ్రులను ఒప్పించి 2016 అక్టోబర్ 20వ తేదీన వివాహం చేసుకున్నారు. వారికి ఏడు సంవత్సరాల కుమారుడు మహబూబ్ ఉన్నాడు. షరీఫ్ అలియాస్ చెర్రీ.. మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు ఆహార పంపిణీ విభాగంలో పర్యవేక్షకుడిగా పనిచేస్తుండగా, పూజ అలియాస్ ఫర్హానా గృహిణిగా కొనసాగుతూ దాంపత్య జీవితం ఆనందంగా గడుపుతున్నారు.

రైలు కలిపిన బంధం..



పిల్లలతో మోతీలాల్, నిర్మల దంపతులు

నెహ్రూసెంటర్ : ఆ దంపతులకు డిగ్రీ చదువుకునే రోజుల్లో రైలులో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇంకేముంది స్నేహితుల సహకారంతో పెళ్లితో ఒక్కటై ప్రస్తుతం అన్యోన్యంగా జీవిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలానికి చెందిన బానోత్ మోతీలాల్, కేసముద్రానికి చెందిన నిర్మల 2004లో ఖమ్మంలోని ఓ కళాశాలలో చదువుకున్నారు. కళాశాలకు రోజూ రైలులో రాకపోకలు సాగించేవారు. ఈ క్రమంలో రైలులో ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో 2005లో మహబూబాబాద్‌లోని గాయత్రీ దేవాలయంలో వివాహం చేసుకున్నారు. వివాహం అనంతరం 2009లో నిర్మల ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగం సాధించింది. 19 ఏండ్ల వివాహ జీవితంలో ముగ్గురు పిల్లలతో జీవితం సాఫీగా సాగుతుందని ఆ దంపతులు చెబుతున్నారు.

ప్రజాసేవలో ప్రేమికులు..



మల్లవరం దివ్య, అరవింద్‌రెడ్డి దంపతులు

బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లికి చెందిన మల్లవరం అరవింద్ రెడ్డి, బచ్చన్నపేటకు చెందిన పులిగిల్ల దివ్య జనగామలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదుకునే వారు. 2009లో పెద్దలను ఎదిరించి కులాంతర వివాహం చేసుకున్నారు. అనంతరం 2019లో దివ్య కేసిరెడ్డిపల్లి సర్పంచ్‌గా.. అరవింద్‌రెడ్డి 2020లో జనగామ మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. సేవలో ఇద్దరూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

కులాలు వేరైనా..



కుమారుడితో గాయత్రి రవిచంద్ర దంపతులు

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన చెందిన నారగోని రవిచంద్ర (గౌడ)– ఎర్రబెల్లి గాయత్రి (వెలమ) కులాలు వేరైనా ప్రేమబంధం వీరిని కలిపింది. 2016లో హనుమకొండలో ఇంటర్ చదువుతున్న గాయిత్రితో రవిచంద్రుకు పరిచయం ఏర్పడింది. 2020లో ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నప్పటికీ తల్లిదండ్రుల అంగీకారంతోనే గాయత్రి అత్తగారింట్లో అడుగుపెటడం గమనార్హం. ప్రస్తుతం గాయత్రి అమెరికాలో ఉన్నతవిద్యాభ్యాసం కొనసాగిస్తోంది. కష్టాలు ఎదురైనా అనుభవించి తమ ప్రేమను నిలుపుకున్న వీరు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఖండాలు దాటిన ప్రేమ



మధుసూదన్ కుటుంబం

నయింనగర్: హనుమకొండ భీమారానికి చెందిన ప్రముఖ మైమ్ కళాకారుడు, సినీనటుడు అరుసం మధుసూదన్– ఫ్రాన్స్ దేశానికి చెందిన సబ్రీనా అనస్థాషియో ప్రేమించి పెళ్లిచేసుకుని ఆనందంగా జీవిస్తున్నారు. ఒడిశాలో నృత్యం నేర్చుకోడానికి వచ్చిన సబ్రీనా.. నృత్యంలో అభినయ మెళకువల కోసం ఫేస్‌బుక్‌లో మధుకు పరిచయమైంది. మధును కలవడానికి వచ్చిన సబ్రీనా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అతడిని చూడగానే తన ప్రేమను వ్యక్తం చేసింది. ఇరు కుటుంబాల సమ్మతంతో హనుమకొండలో 6 అక్టోబర్ 2016లో హిందూసంప్రదాయ ప్రకారం వివాహం చేసుకున్నారు. తమ కుమార్తె లలితా రాజ్(6)కు రెండు దేశాల సంస్కృతి సంప్రదాయాలు నేర్పుతూ ఫ్రాన్స్‌లో చదివిస్తున్నారు.

పెద్దలను ఎదిరించి..



రేణుక, శ్రీనివాస్ కుటుంబం

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన పిట్టల శ్రీనివాస్, దూల్మిట్ట రేణుక చిన్నప్పటి నుంచి కలిసి పెరిగారు. ఒకే గ్రామానికి చెందిన వీరిద్దరి అభిప్రాయాలు కలిసి 1999లో పెద్దలను ఎదురించి ఆర్య సమాజ్‌లో వివాహం చేసుకున్నారు. అనంతరం గ్రామానికి వచ్చి నివాసం ఉంటున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకొని పలువురుకి ఆదర్శంగా నిలుస్తుంది ఈ జంట.

పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నాం



శ్రీనివాస్, కవిత పెళ్లి ఫొటో

తరిగొప్పుల: మా ఇద్దరిది ఒకే సామాజిక వర్గం కావడంతో పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నాం. నా భార్య కవిత సొంత ఊరు హుస్నాబాద్ తాలుకా మీర్జాపురం. మాది మండలంలోని భోజ్యాతండా. 2016లో బంధువుల పెళ్లిలో ఇద్దరం కలిశాం. సంవత్సరం పాటు ప్రేమించుకున్నాం. ఇరువురి ఇళ్లలో తెలియడంతో మొదట్లో గొడవలు జరిగాయి. చివరకు మా ప్రేమను పెద్దలు అంగీకరించడంతో 2017లో పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నాం. నాటినుంచి ఆనందంగా గడుపుతున్నాం.

–లావుడ్య శ్రీనివాస్, భోజ్యాతండా, తరిగొప్పుల

ప్రాంతీయ భేదం లేకుండా జీవిస్తున్నాం..



నేను హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న సమయంలో ఢిల్లీకి చెందిన ప్రియాంక మహాజన్‌తో ప్రేమలో పడ్డా. కొంత కాలం తర్వాత ప్రపోజ్ చేశా. తను కూడా ఇష్టపడడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాం. ప్రాంతీయ భేదం లేకుండా కలిసిమెలిసి ఉంటున్నాం. మాకు ఒక బాబు, పాప ఉన్నారు. నేను అడ్వకేట్‌గా కొనసాగుతున్న. నా భార్య హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తుంది. గ్రామానికి సేవ చేయాలనే లక్ష్యంతో గత ఎన్నికల్లో పంగిడిపల్లిలో నా భార్యను సర్పంచ్ పదవికి పోటీ చేయించగా గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

– కాసర్ల అరవింద్‌రెడ్డి, పంగిడిపల్లి, టేకుమట్ల మండలం

ప్రేమ వివాహంతో ఆనందం..



← చిన్నబోయిన రేఖ, రాజు

జనగామ రూరల్ : మండలంలోని పెంబర్తికి చెందిన చిన్నబోయిన రేఖ, రాజు.. ప్రేమ వివాహం చేసుకున్నారు. 2009 సంవత్సరం నుంచి ప్రేమించుకున్న వీరు 2014లో పెళ్లి చేసుకున్నారు. ఒకే సామాజిక వర్గమైనా ఇరువురి కుటుంబీకులు వీరి వివాహానికి ఒప్పుకోలేదు. అయినా ఎదిరించి పెళ్లి చేసుకుని దాంపత్య జీవితంలో సంతోషంగా ఉన్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు అభిరామ్, అక్షర ఉన్నారు. రాజు తన భార్యకు అండగా ఉంటూ డిగ్రీ, పీజీ చదివించారు. కాగా, ప్రేమ వివాహంతో ఆనందంగా జీవిస్తున్నామని రేఖ, రాజు దంపతులు ఈ సందర్భంగా తెలిపారు.

కులం, ఆర్థిక పరిస్థితి అడ్డుకాదు..

రఘునాథపల్లి: ప్రేమకు కులం, ఆర్థిక పరిస్థితి అడ్డుకాదని నిరూపించారు ఆ దంపతులు. మూడు దశాబ్దాల క్రితం పెద్దలను ఎదురించి ప్రేమ వివాహం చేసుకుని ఆనందకర జీవితం గడుపుతున్నారు. మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రభాకర్, లక్ష్మి దంపతులు 32 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి దాంపత్య జీవితంలో ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉంది. పెద్ద కుమారుడు ఉదయ్‌కుమార్ ఓయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, రెండో కుమారుడు పృథ్వీకుమార్ ఆరోరా కాలేజీలో లా చదువుతున్నాడు. మూడో కుమారుడు ప్రణయ్‌కుమార్ సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. కూతురు మౌనశ్రీ ఇందిర ప్రియదర్శిని కాలేజీలో విద్యాభ్యాసం చేస్తోంది. కుమారులు చదువులో రాణిస్తుండడంతో ఆ దంపతుల ఆనందానికి అవధుల్లేవ్.



ప్రభాకర్, లక్ష్మి దంపతులు →

ఐదేళ్ల పగ..

- మూఢనమ్మకంతో తల్లీకొడుకుల దారుణ హత్య
- మంత్రాలు చేస్తున్నారనే నెపంతో ఈ ఘాతుకం
- నిందితుడు, మృతుల కుటుంబాల మధ్య ఐదు సంవత్సరాలుగా గొడవలు



ఘటనాస్థలిలో రోదిస్తున్న మృతుల కుటుంబీకులు



పోలీసులను అడ్డుకుంటున్న బంధువులు

గూడూరు: మానుకోట జిల్లా గూడూరు మండల కేంద్రంలో మంగళవారం తల్లీకొడుకులు హత్యకు గురయ్యారు. ఈఘటనలో మృతిచెందిన తల్లీకొడుకులు, నిందితుడు శివరాత్రి కుమారస్వామికి మధ్య ఐదు సంవత్సరాల నుంచి గొడవలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. వారి కథనం ప్రకారం మండలంలోని బొల్లెపల్లికి చెందిన అలకుంట సమ్మక్కకు మంత్రాలు వస్తాయని కొన్ని సంవత్సరాల నుంచి ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా సమ్మక్క బంధువు శివరాత్రి కుమారస్వామికి 8 సంవత్సరాల క్రితం వివాహమైంది. అనంతరం 6నెలలకు కుమారస్వామి భార్య అనారోగ్యానికి గురైంది. ఆమెను ఆస్పత్రిలో చూపిస్తుండగా ఎంతకూ తగ్గడం లేదు. దీంతో దేవుడిపై నమ్మకంతో ఓ శివసత్తును సంప్రదించగా.. కుమారస్వామి భార్య అనారోగ్యానికి కారణం ఇంటి పక్కన ఉన్న ఓ మహిళ మంత్రాలు చేయడమేనని తెలిపింది. అప్పటి నుంచి మంత్రాలు, చేతబడులను నమ్మిన కుమారస్వామి కుల పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించాడు. ఈ విషయంలో తనకు ఏమీ తెలియదని సమ్మక్క చెప్పింది. ఈ ఘటనలో పలుమార్లు గొడవలు జరుగుతుండగా.. మరోపక్క తన భార్య అనారోగ్యానికి గురికావడంతో మంత్రాలు, చేతబడి కారణమని నమ్మిన కుమారస్వామి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పోలీసుల నిర్లక్ష్యమే కారణమా..!

తన మానసిక బాధ, తన భార్య అనారోగ్యానికి మంత్రాలే కారణమని, తనకు సదరు మహిళలతో ప్రాణహాని ఉందని ఈ నెల 9వ తేదీన శివరాత్రి కుమారస్వామి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు పరిశీలించిన పోలీసులతో పెద్దల సమక్షంలో మాట్లాడుకుంటామని తల్లీకొడుకు సమ్మక్క, సమ్మయ్య చెప్పగా కుమారస్వామి విసిగినట్లు తెలిసింది. ఇక ఈ సమస్యను పోలీసులు, పెద్దలు పరిష్కరించలేరని గుర్తించిన కుమారస్వామి.. ఐదు సంవత్సరాల నుంచి ఏర్పరుచుకున్న మూఢనమ్మకంతో ఆ కుటుంబంపై పగ పెంచుకుని ఈ దారుణానికి పాల్పడినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు.. తల్లీకుమారుడి హత్యకు పోలీసుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళన చేశారు. దీంతో పోలీసులు నిందితుడిపై చర్యలు తీసుకుంటామని ఆందోళకారులను బుజ్జగించడం చర్చనీయాంశంగా మారింది.



'మండమెలిగె'కు వేళాయె..

- నేడు మేడారం, కన్నెపల్లిలోని అమ్మవార్ల ఆలయాల్లో శుద్ధి
- పసుపు, కుంకుమలతో అలంకరణ
- ప్రత్యేక పూజలు నిర్వహించనున్న పూజారులు



సమ్మక్క గుడి



సారలమ్మ గుడి

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయాల్లో నేడు (బుధవారం) పూజారులు అమ్మవార్లకు మండమెలిగె పండుగ పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సమ్మక్క పూజారులు ఉదయాన్నే తలస్నానాలు ఆచరించి మేడారంలోని సమ్మక్క గుడి శుద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం సమ్మక్క పూజారి సిద్దబోయిన మునీందర్ ఇంటి నుంచి పసుపు, కుంకుమలు తీసుకొని పూజారులు సమ్మక్క గుడికి చేరుకుంటారు. గుడిలోని ధూప, పూజా సామగ్రిని శుభ్రం చేస్తారు. అనంతరం ఆడపడుచులు పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. అలాగే, గ్రామ శివారులోని పోచమ్మ, మైసమ్మ ఆలయాల వద్ద పూజాలు నిర్వహిస్తారు. గ్రామంలోని బొడ్రాయిని పవిత్ర జలంతో శుద్ధి చేసి పసుపు, కుంకుమలతో పూజలు చేస్తారు. అనంతరం ఆలయం తూర్పు, పడమర ప్రవేశ మార్గాల్లో కొత్తగా తీసుకొచ్చిన బురుగు కర్రలకు పసుపు, కుంకుమలు పెట్టి పూజలు చేసిన అనంతరం మామిడి తోరణాలు, ఉల్లిగడ్డ, కోడి పిల్లలను కట్టి (దిష్టి తగలకుండా) ధ్వంజస్తంభాన్ని నిలిపి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం రాత్రి సమయంలో సమ్మక్క ప్రధాన పూజారి (వడ్డె) కొక్కెర కృష్ణయ్య, పూజారులు కలిసి పసుపు, కుంకుమలు తీసుకొని బూర కొమ్ముల శబ్దాలు, డోలు వాయిద్యాల మధ్య సమ్మక్క గద్దె పైకి చేరుకుంటారు. గద్దెలపై పసుపు, కుంకుమల పెట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించి గద్దెల ప్రాంగణంలోనే బుధవారం రాత్రంతా జాగారం చేస్తారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ పూజారులు శాక (కల్లు) ఆనవాయితీగా ఇచ్చిపుచ్చుకొని సంబురాలు జరుపుకుంటారు. అలాగే గురువారం ఉదయాన్నే సమ్మక్క పూజారులు పూజా సామగ్రితో మళ్లీ గుడికి వెళ్లి పూజలు చేస్తారు.

కన్నెపల్లిలోని సారలమ్మ గుడి వద్ద..

కన్నెపల్లిలోని సారలమ్మ గుడి వద్ద మండమెలిగె పండుగను బుధవారం ఘనంగా నిర్వహిస్తారు. మొదట సారలమ్మ ఆలయంతో పాటు అమ్మవారి వస్త్రాలు, పూజా సామగ్రిని శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేసి మామిడి తోరణాలతో అలంకరిస్తారు. మధ్యాహ్నం వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం సారలమ్మ పూజారి కాక సారయ్యతో పాటు సారలమ్మ పూజారులు పసుపు, కుంకుమలు, శాక (కల్లు) తీసుకొని మేడారంలోని సారలమ్మ గద్దె వద్దకు చేరుకుంటారు. సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద పూజలు చేసి రాత్రంతా జాగారం చేసి సంబురాలు చేసుకుంటారు. అనంతరం గురువారం ఉదయం సారలమ్మ గుడికి చేరుకొని మళ్లీ పూజలు నిర్వహిస్తారు. మండమెలిగె పండుగ సందర్భంగా స్థానిక ఆదివాసీలు, గ్రామస్తులు ఇళ్లను శుద్ధి చేసుకుని సమ్మక్క, సారలమ్మ దేవాలయాలకు చేరుకొని పూజలు నిర్వహిస్తారు. జాతరకు వారం రోజుల ముందుగా మండమెలిగె పండుగను పూజారులు నిర్వహిస్తారు.

పూజారులు సిద్ధం

మండమెలిగె పండుగ నిర్వహించేందుకు సమ్మక్క–సారలమ్మ పూజారులు సిద్ధమవుతున్నారు. మంగళవారం పూజారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మేడారం దేవాదాయశాఖ తరఫున మండమెలిగే పండుగకు కావాల్సిన పూజ సామగ్రిని అందజేశారు. ఈ పండుగ పూజ కార్యక్రమాల సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. మండమెలిగె పండుగతో మహాజాతర ఆరంభానికి నాంది పలుకుతుంది. మండమెలిగె పండుగను పురస్కరించుకుని భక్తులు భారీగా తరలివస్తారని అధికారులు అంచనా వేసి మంగళవారం సాయంత్రం నుంచే బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

VEHICLES FOR SALE

■ 209 Model. JCB 3DX BHL, TS-25-C-2408, 2019 model TATA LPT 3118/52/BS-IV, TS-03-UC-4356, Vehicles for sale. M/s. Indusind Bank Ltd. Cont: 9959454921. [W-1220981]

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710 [G-1433]

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899 [H-793691]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ మేసేజ్‌లు పంపుతూ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 95027 12418, 90306 12463 [M-1233787]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233785]

■ పని మనిషి కావలెను. హైదరాబాద్‌లో డాక్టర్స్ కుటుంబానికి ఇంట్లోనే ఉండి వంట పని & చిన్నపిల్లలను చూచుకొనుటకు 18 - 30 ఏళ్లలోపు గల స్త్రీ కావలెను. జీతం 15,000/- ఫ్రీ భోజనం, వసతి కలదు. వివరాలకు D.బాలాజీ: 9246969042, 9848175211. [V-2393]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ఎస్ఆర్' ప్రభంజనం



దొంతుల మనీష్ తుమ్మ తేజస్వి ఆర్ దీపాంశరెడ్డి కె సిద్ధార్థరెడ్డి కె శ్రీరాంరెడ్డి



పి.నిహాల్‌శ్రీవాత్సవ

విద్యారణ్యపురి : దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక మైన జేఈఈ (మెయిన్స్) –2024 సెషన్ –1 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ వరదారెడ్డి తెలిపారు. దొంతుల మనీష్ 295/300 మార్కులు (ఫిజిక్స్‌లో వంద పర్సంటైల్, కెమిస్ట్రీలో వంద పర్సంటైల్) 99.99 శాతం సాధించి కళాశాల ప్రతిష్టను జాతీయస్థాయిలో నిలిపారని తెలిపారు. తుమ్మతేజస్విని 99.95శాతం, ఆర్ దీపాంశరెడ్డి 99.91శాతం, పి.నిహాల్ శ్రీవాత్సవ 99.91శాతం సాధించినట్లు తెలిపారు. కె.శ్రీరామ్‌రెడ్డి 99.88శాతం , కె సిద్ధార్థరెడ్డి 99.77శాతం, వడ్లూరి ప్రతీక్ 99.75శాతం, వి.సాయి ప్రణతి 99.66శాతం, ఉప్పుల సూర్యతేజ 99.57శాతం, కె.డి చెన్నకేశవరెడ్డి 99.43శాతం,మోదుల శ్రీవల్లి 99.42శాతం, మంచాల చంద్రదీప్ 99.35శాతం, కె సుబ్రమణ్యఆకాష్ 99.32శాతం, వల్లూరివిశాలి 99.31శాతం సాధించారని వరదారెడ్డి తెలిపారు. 18 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించారని తెలిపారు. ఈ ఫలితాలపై ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింత అత్యుత్తమ మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీపరీక్షల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని వారు తెలిపారు.

'కెరీయర్ పాయింట్' విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న కెరీయర్ పాయింట్ చైర్మన్ కరుణాకర్

కాజీపేట అర్బన్ : హనుమకొండ హంటర్‌రోడ్డు న్యూశాయంపేటలోని కెరీయర్ పాయింట్ విద్యార్థులు జేఈఈ మెయిన్స్–2024 ఫలితాల్లో విజయభేరి మోగించారని వరంగల్ బ్రాంచ్ చైర్మన్ జూలపెల్లి కరుణాకర్ మంగళవారం తెలిపారు. కోటా రాజస్థాన్ వారి కెరీయర్ పాయింట్ నగరంలో ప్రారంభించిన మొదటి బ్యాచ్‌తోనే జేఈఈ మెయిన్స్–24లో ఫలితాల్లో వివిధ సబ్జెక్టుల్లో ఓవరాల్‌గా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. కె.హరిప్రీత్–98.78, ఎ.హేమంత్ 98.57, పి.శ్రీజ–98.43, సి.చరిత్రార్ధ–98.30, బి.ఆశ్రిత్–98.23, ఎం.సంజయ్–98.15లతో పాటు పలువురు విద్యార్థులు ఆల్ ఇండియాలో సీటు సాధించే స్థాయిలో పర్సంటైల్ సాధించారన్నారు. కెరీయర్ పాయింట్ సెక్రటరీ కోదాటి మధుపాల్, డైరెక్టర్లు బొంపెల్లి దేవేందర్‌రావు, నకిరకంటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ దేవేందర్ విద్యార్థులను అభినందించారు.

'రెజోనెన్స్' విజయదుందుభి



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ రాజి రెడ్డి, డైరెక్టర్లు

హన్మకొండ: జేఈఈ మెయిన్ –2024 ఫలితాల్లో రెజోనెన్స్ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం ఫలితాలు విడుదల చేసింది. ఈ ఫలితాల్లో వరంగల్, హనుమకొండలోని రెజోనెన్స్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఆరుగురు విద్యార్థులు 99 పర్సంటైల్ కంటే అధిక మార్కులు, 112 మంది విద్యార్థులు 90 పర్సంటైల్‌కు పైగా మార్కులు సాధించారని రెజోనెన్స్ విద్యా సంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. సి.హెచ్.ధీరజ్ 99.96; ఎ.సాయి శ్రీనివాస్ 99.81, టీ.వీ.సాయి ప్రణీత్ 99.67, డి.శ్రీతేజ 99.41, వి.చంద్రశేఖర్ 99.31, ఎం.బాల ఆదిత్య 99.15 పర్సంటైల్ మార్కులు సాధించారని వివరించారు. వీరితో పాటు చాలా మంది ఎన్ఐటీలో సీట్ పొందడానికి కావాల్సిన పర్సంటైల్ సాధించారన్నారు. మంగళవారం హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రెజోనెన్స్ విద్యా సంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి, డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి అభినందించారు.